జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

మంగళవారం, మార్చి 10, 2026 | పేజీలు: 9








## పరిసరాల పరిశుభ్రతతోనే
# ఆరోగ్యం

-- కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భూత్పూర్ మున్సిపాలిటీలో పరిశుభ్రత కార్యక్రమాల పరిశీలన
- కేజీబీవీ పాఠశాల తనిఖీ



**మహబూబ్‌నగర్, మార్చి 9 ( ప్రజా జ్యోతి బ్యూరో )** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం భూత్పూర్ మున్సిపాలిటీని సందర్శించిన కలెక్టర్ పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి హోటల్, కేజీబీవీ పాఠశాలను సందర్శించిన ఆమె చెత్త సేకరణ విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి సేకరించాలని అధికారులకు సూచించారు. అనంతరం భూత్పూర్ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థినులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా వంటశాలను పరిశీలించి మధ్యాహ్న

-మిగతా 2లో..

## ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా
# పరిష్కరించాలి

–జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్ కర్నూల్ : మార్చ్ 09 ప్రజా జ్యోతి** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలోని ప్రజావాణి సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు శ్యామ్ ప్రసాద్ లాల్,అమరేందర్, జిల్లా పరిషత్ సీఈవో

-మిగతా 2లో..

## కార్పొరేట్ స్కూళ్లకు
# అధికారుల అండ

- ప్రజావాణిలో డీఈఓ, ఎంఈఓలపై విద్యార్థి సంఘాల ఫిర్యాదు
- అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం

2 లో




## ధర్మం సేవా భక్తి తో జీవనం
# కొనసాగించాలి



2 లో

- శ్రీరామానుజ చిన్న జీయర్ స్వామి
- చిన్న జీయర్ స్వామి రాకతో ఆధ్యాత్మిక శోభా సంతరించుకుంది
- ఎమ్మెల్యే వంశీకృష్ణ
- అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహం ధ్వజస్తంభ ప్రతిష్టాపన

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

న్యాయమూర్తి ఎస్. రవికుమార్

2 లో



# కార్పొరేట్ స్కూళ్లకు అధికారుల అండ

మహబూబ్‌నగర్, మార్చి 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ): మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యాశాఖ అధికారుల పనితీరుపై ప్రజావాణి కార్యక్రమంలో తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా విద్యాశాఖ అధికారి ఏపూరి ప్రవీణ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి ఆంగోత్ లక్ష్మణ్ సింగ్‌లు తమ బాధ్యతలను పక్కనబెట్టి కార్పొరేట్ పాఠశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి హాజరు కాకపోవడం పట్ల కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు వినేందుకు నిర్వహించే కార్యక్రమానికి హాజరు కాకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కలెక్టర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఇటీవల డీఈఓపై అవినీతి ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ ద్వారా విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. అయినప్పటికీ జిల్లాలో పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని వారు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్, ఒరిజిన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రభుత్వ అనుమతి లేకుండానే కొనసాగుతున్నాయని ఆరోపించారు. సీజ్ చేసినట్లు అధికారుల ప్రకటనలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సీజింగ్ చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రస్తుతం కూడా ఆ పాఠశాలల్లో అడ్మిషన్లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపించారు.

కార్పొరేట్ పాఠశాలల నుంచి లంచాలు తీసుకుంటూ అధికారులే వారికి మద్దతు ఇస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ ప్రతిష్ట దెబ్బతింటోందని వారు విమర్శించారు. ఈ పరిస్థితి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో వెంటనే స్పందించిన కలెక్టర్, డీఈఓ మరియు ఎంఈఓల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఒక వారం రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం.

ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ సెక్రెటరీ భరత్, నాయకులు కేశవులు, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు దోమ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో విద్యా వ్యవస్థను కాపాడేందుకు అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. అదేవిదంగా డీఈఓ ప్రవీణ్ కుమార్ ఎంఇఓ లక్ష్మణ్ సింగ్ లు మర్లులోని గీతం గ్లోబల్ స్కూల్, సంస్కృతి, ఐ.ఎ.ఎఫ్, షెం రాక్, ఈ పాఠశాలలను సీజ్ చేశామని తప్పుడు సమాచారం ఇస్తున్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

భోజనాన్ని తనిఖీ చేశారు. అన్నం మెత్తగా వండినట్లు గమనించి వంట సమయంలో జాగ్రత్తలు పాటించాలని వంట సిబ్బందికి సూచించారు.

పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఆందోళన చెందకుండా క్రమంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఏ సబ్జెక్టులోనైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని విద్యార్థినులకు తెలిపారు.

అలాగే పాఠశాలలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, మూత్రశాలలు మరియు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కేజీబీవీలో రాష్ట్రీయ బాల్ స్వాస్త్య కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో మొత్తం 270 మంది విద్యార్థినులు ఉన్నారని స్పెషల్ ఆఫీసర్ తెలిపారు. రోజుకు సుమారు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్యశాఖ అధికారులు వెల్లడించారు.

విద్యార్థినుల హిమోగ్లోబిన్ స్థాయిలను పరిశీలించిన కలెక్టర్, హిమోగ్లోబిన్ తగ్గితే బలహీనత, నీరసం వస్తాయని పేర్కొన్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థినులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

## ధర్మం సేవా భక్తి తో జీవనం

# కొనసాగించాలి

నాగర్ కర్నూల్ మార్చ్ 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహం ధ్వజస్తంభన ప్రతిష్టాపన కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథులుగా శ్రీరామానుజ చిన్న జీయర్ స్వామి వంశీకృష్ణ ఎమ్మెల్యే దంపతులు హాజరై, భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణాల మధ్య ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించి స్వామి వారిని ప్రతిష్టించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని చిన్న జీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ రామానుజ చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. భక్తులు ధర్మం భక్తి సేవాభావంతో జీవనం కొనసాగించాలని ఆత్మీయ సందేశం అందించారు. అదేవిధంగా అచ్చంపేట ఎమ్మెల్యే దంపతులు మాట్లాడుతూ ఈ




ప్రాంతానికి చిన్న జీయర్ స్వామి రాకతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభాసంకరించుకుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. స్వామివారు చెప్పిన సన్మార్గంలో ప్రజలు జీవనం కొనసాగించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ అంతటి రజిత మల్లేష్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

దేవ సహాయంలతో కలిసి ప్రజా వాణికి హాజరై ప్రజల నుంచి అర్జీలు,వినతులు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్వీకరించారు.అనంతరం అధికారులతోమాట్లాడుతూ ప్రజాసమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు,వినతులనుపరిశీలించి,సత్వర పరిష్కారం చూపే విదంగాసంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టి,పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి,వెంటనే పరిష్కరించేలా చర్యలుచేపట్టాలన్నారు.అదేవిదంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అందరూ పరిసరాల పరిశుభ్రతపై పనిచేయాలనికార్యాలయాల్లో ఫైళ్లను సక్రమంగా నిర్వహించి,

పెండింగ్ ఫైళ్లు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్,వివిధ విభాగాల సూపరింటెండెంట్లు,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పెద్దమారూర్ గ్రామశీలో రెండో విడత వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం

**-ఐదు రోజులపాటు వార్డు సభ్యుల శిక్షణా తరగతులు**

చిన్నంబావి, మార్చి 9 (ప్రజాజ్యోతి): చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ గ్రామ రైతు వేదిక కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీఓ రామస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో గ్రామ పరిపాలన, వార్డు సభ్యుల బాధ్యతలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు విధానంపై వివరంగా అవగాహన కల్పించారు.తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018 ప్రకారం గ్రామాల్లో అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.మొత్తం 78 మంది వార్డు సభ్యులకు గాను 50 మంది శిక్షణకు హాజరుకాగా, 28 మంది గైర్హాజరయ్యారు. వరుసగా మూడు సమావేశాలకు హాజరు కాకపోతే వారిని పదవుల నుంచి తొలగించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని అధికారులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో రామస్వామి, టిఓటిలు రాజబాబు, గోపాల్ రెడ్డి, బాలశేషు, పి. రాజు వివిధ గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## తోటపల్లి గ్రామంలో ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

కల్వకుర్తి మార్చ్ 9( ప్రజా జ్యోతి):

కల్వకుర్తి మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో ప్రతి ఏట రేణుక ఎల్లమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాలు
నిర్వహిస్తారు. ఎల్లమ్మ దేవత బ్రహ్మోత్సవాల లో భాగంగా సోమవారం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం బొడ్రాయి వద్ద బైండ్ల వారిచే నాటక ప్రదర్శన చేపట్టారు.రేణుక ఎల్లమ్మ అమ్మవారిని గర్భగుడి నుండి గంగ స్థానానికి గ్రామస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో డప్పు వాయిద్యాల తో గంగ స్థానాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఎల్లమ్మ దేవాలయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్ట బంగారు కు పోవడం జరిగింది. సాయంత్రం బైండ్ల వారిచే గ్రామంలో ఎల్లమ్మ రాక్షసుడు వేషధారణ వేసి రౌండ్ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ పరిసరాల ప్రాంతంలో భక్తులకు తిను బండారాల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం బ్రహ్మోత్సవాల కమిటీ అధ్యక్షులు తోటపల్లి అనిల్ కుమార్. జానకి. మహేష్. మల్లేష్. ఈశ్వరయ్య. వెంకటయ్య. పరుశరాములు. బాల చెన్నయ్య. ఆంజనేయులు. రామకృష్ణ. రవి. భక్తులు. మహిళలు గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

గద్వాల మార్చి 09(ప్రజా జ్యోతి ప్రతినిధి):

ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కాదగిన వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని మొదటి అదనపు ప్రధాన న్యాయమూర్తి ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం గద్వాల కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లు,కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరగకుండా ఇరు వర్గాలను సమన్వయం చేసి క్రిమినల్ కేసుల రాజీపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు చొరవ తీసుకోవాలని ఆయన తెలిపారు.రాజీ మార్గమే రాజమార్గమని,కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం,డబ్బు వృథా చేసుకోకుండా రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి.లక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.వి.హెచ్.పూజిత,మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉదయ నాయక్,అడిషనల్ ఎస్పీ శంకర్,ఏపీపీ భవాని,వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు,పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ టీచర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన

**వంగూరు మార్చి 9 ( ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలంలో కస్తూరిబాగాంధీ బాలిక వికాస విద్యాలయం మరియు పట్టణ గురుకులాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న దాటవేత వైఖరికి నిరసనగా టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో దశల వారి పోరాటంలో భాగంగా ఈ రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల కేంద్రంలో ఉద్యోగస్తులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ. చిన్నయ్య గారు మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ ఎస్, ఎస్ ఎస్ ఎ ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కూడా చాలీచాలని వేతనాలు గానే ఉన్నాయని, గత సంవత్సరం 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు అంగీకరించిన అంశాలు ఇప్పటివరకు అములుకు నోచుకోలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే ఎస్ ఓలను ప్రిన్సిపాల్ గా, సిఆర్టీలను జూనియర్ లెక్చరర్లుగా, సిఆర్ పీ, పిఇటీ, సిఆర్ పిలను స్కూల్ అసిస్టెంట్ లుగా పరిగణించి కనీస మూల వేతనాన్ని చెల్లించాలని, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని అన్నారు. కేజీబీవీ లలో కేర్ టేకర్లను నియమించి రాత్రి కాపలా డ్యూటీల నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు అయినా రాష్ట్ర ప్రభుత్వం



సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 16న జిల్లా కేంద్రంలో, మార్చి 20న చలో అసెంబ్లీ నిర్వహించి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి ఎఫ్ డబ్లుఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె లింగమయ్య గారు, కేజీబీవి యస్ ఓ కృష్ణవేణీ గారు, వంగూరు మండల కమిటీ అధ్యక్షులు ఈ. జంగయ్య, ప్రధాన కార్యదర్శి యస్ మల్లేష్, జిల్లా నాయకులు కె. సత్యనారాయణ, యం. పుల్లయ్య , బి. నాగభూషణం, సిఆర్పీలు లక్ష్మణ్, వేదమూర్తి, కంప్యూటర్ ఆపరేటర్ ఆంజనేయులు, యం ఐ యస్ రహామాన్, కేజీబీవి టీచర్లు స్వాతి,సరిత, వెంకటమ్మ, జయప్రద, ఇందిరా, మౌనిఖ,తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు,మహిళల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా షీ టీమ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

**ఉండవల్లి మార్చి 09 (ప్రజా జ్యోతి):**

జోగుళాంబ గద్వాల జిల్లాలో బాలికలు,మహిళల భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని,జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశారు.ఈ క్రమంలో ఉండవెల్లి మండలంలోని ఆ పరిషత్ హై స్కూల్లో విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవ్ టీజింగ్, మహిళలపై వేధింపులు,పబ్లిక్ ప్రదేశాలలో మహిళలకు ఎదురయ్యే ఇబ్బంది /ప్రమాద ఘటనలు,వాటిని ఎలా గుర్తించాలి,వాటినుంచి ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు సవివరంగా వివరించారు.బస్ స్టాండ్లు,రైల్వే స్టేషన్లు,స్కూళ్లు,కళాశాలలు వంటి జనసంచార ప్రాంతాల్లో మహిళలను వేధించే వ్యక్తులను గుర్తించడంలో షీ టీమ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.వేధింపులకు గురయ్యే సందర్భంలో విద్యార్థులు ఎటువంటి సంకోచం లేకుండా వెంటనే షీ టీమ్ హెల్ప్‌లైన్ 8712670312 కు సంప్రదించాలని సూచించారు.ఇట్టి సమయంలో కాల్ చేసిన వారి వివరాలు కూడా గోప్యంగా ఉంచుతాము అని తెలిపారు.ఫిర్యాదు వచ్చిన వెంటనే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని,ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకున్నట్లు షీ టీమ్ తెలిపింది.జిల్లా పోలీస్ శాఖ బాలికలు,మహిళల భద్రత,గౌరవ పరిరక్షణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని,ఇటువంటి అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా విస్తరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ పి.సి.లు హనుమంతు,యశ్వంత్,లోకేశ్వరీ హెడ్మాస్టర్ హేమలత,ప్రణీత కుమారి,విద్యార్థినిలు పాల్గొన్నారు.




# జడ్చర్ల జర్నలిస్టుల ఇండ్ల సమస్యకు త్వరలో పరిష్కారం..

## – మంత్రి పొంగులేటి హామీ

జడ్చర్ల, మార్చి 09, ప్రజా జ్యోతి

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న జడ్చర్ల జర్నలిస్టుల కలలకు ఇప్పుడు కొత్త ఆశ కిరణం కనిపించింది. ఎన్నో కష్టాలు, నిరీక్షణల మధ్య నిలిచిపోయిన జర్నలిస్టుల కాలనీ ఇండ్ల నిర్మాణానికి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇవ్వడంతో జర్నలిస్టులలో ఆశాభావం నెలకొంది. సోమవారం సచివాలయంలో మంత్రి చాంబర్లో జరిగిన సమావేశంలో అనిరుద్ రెడ్డి ఆధ్వర్యంలో జడ్చర్ల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టుల కోసం మంజూరైన 40 ఇండ్లలో చాలా నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవడంతో కుటుంబాలతో కలిసి ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వారు వేదన వ్యక్తం చేశారు.కాలనీ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు సుమారు రూ.9 లక్షల బిల్లు పెండింగ్‌లో ఉండటంతో పనులు నిలిచిపోయాయని, వెంటనే ఆ బిల్లును విడుదల చేస్తే నిర్మాణం తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రతినిధులు మంత్రికి వివరించారు. జర్నలిస్టుల మాటలను శ్రద్ధగా విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, జర్నలిస్టులు సమాజానికి కళ్ళు, చెవులు లాంటి వారని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లును తక్షణమే విడుదల చేసి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో మిగిలిన ఇండ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. ఇక ఇండ్లతో పాటు కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలైన విద్యుత్ సరఫరా, మురికి కాలువలు, త్రాగునీటి వసతి వంటి అంశాలకు కూడా నిధులు కేటాయించి త్వరలోనే అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేలోపు కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించి జర్నలిస్టులు ప్రశాంతంగా జీవించే వాతావరణం కల్పిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, ఉపాధ్యక్షుడు శేఖర్ తెలుగు, కోశాధికారి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మల్లేష్, కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు వెంకటయ్య, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులకు శ్రీకారం

### 21వ వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్



**గద్వాల మార్చి 09 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

గద్వాల పట్టణంలోని 21వ,వార్డులో ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పనులను సోమవారం వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వార్డులోని డ్రైనేజీలను శుభ్రపరచడం,చెత్తను తొలగించడం వంటి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.వార్డు పరిధిలో పరిశుభ్రతను మెరుగుపరచేందుకు మున్సిపాలిటీ సిబ్బంది విస్తృతంగా శ్రమించారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మన్సూర్,అహ్మద్,ఇంజినీరింగ్ సిబ్బంది,వార్డు ఆఫీసర్ హిమర్ని,అలాగే మున్సిపాలిటీ శానిటేషన్ మరియు డ్రైనేజీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ,కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన మున్సిపాలిటీ సిబ్బందిని అభినందించారు.వార్డులో పరిశుభ్రత,అభివృద్ధి పనులను మరింత వేగంగా కొనసాగిస్తామని తెలిపారు.

## గ్రామ అభివృద్ధికి రెగ్యులర్ సెక్రటరీ అవసరం

### అదనపు కలెక్టర్ నీ,ఐడీఓసి ని కలిసిన సర్పంచ్





అలంపూర్,మనోవపాడ్ (ప్రజా జ్యోతి) మార్చి 09:

పల్లేపాడు గ్రామ అభివృద్ధికి రెగ్యులర్ గ్రామ సెక్రటరీ నీ నియమించాలి.సోమవారం ప్రజావాణిలో జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు ని ఐడిఓసి జిల్లా పంచాయతీ కార్యాలయం నందు జిల్లా పంచాయతీ అధికారి ఏ.శ్రీకాంత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పల్లెపాడు గ్రామనికి రెగ్యులర్ సెక్రటరీ లేకపోగా గ్రామం అభివృద్ధి లేదు.గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ సెక్రటరీ నియమించాలని కోరిన పల్లెపాడు గ్రామ సర్పంచ్ రమేష్ ,గురుస్వామి,నరసింహ,సానుకూలంగా స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ పంచాయతీ అధికారి.

## నేటి నుండి పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు

మల్దకల్ మార్చి 09 (ప్రజా జ్యోతి):జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో మంగళవారం నుండి ఈనెల 10వ తేదీ నుండి ఏప్రిల్ 9వ,తేదీ వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్లు డాక్టర్ ఉష తెలిపారు.పశు పోషకులు సమీపంలోని ఉన్న పశువైద్య డాక్టర్ను సంప్రదించాలని ఆమె కోరారు.పశు వైద్య సిబ్బంది ముందుగా నిర్ణయించిన తేదీల వారిగా గ్రామాలకు వచ్చి ఉచితంగా టీకాలు ఇవ్వబడును,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు పోషకులను కోరడమైనది.

# శ్రీశైలం నిర్వాసితుల కోసం 188 రోజులు నిరాహార దీక్ష చేసిన దామోదర్ రెడ్డి... అనారోగ్యంతో ఆవేదన

## -ఉద్యోగాల కోసం నా జీవితం అంకితం చేశా... నిర్వాసితులకు న్యాయం చేయండి"

చిన్నంబావి,మార్చి 9 (ప్రజాజ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నిర్వాసితుల సంఘం మాజీ అధ్యక్షుడు, శ్రీశైలం నిర్వాసితుల హక్కుల కోసం పోరాడిన కేసిరెడ్డి దామోదర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసిన వెంటనే శ్రీశైలం నిర్వాసితుల కమిటీ సభ్యులు ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎస్. శ్రీనివాసులు, సుధాకర్, రంగస్వామి తదితర నిర్వాసితులు కలిసి దామోదర్ రెడ్డిని కలసి మనోధైర్యం చెప్పి "అన్నా... మేమున్నాం" అంటూ భరోసా కల్పించారు.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ నిర్వాసితులకు ఉద్యోగాలు వస్తాయని, ప్రభుత్వం న్యాయం చేస్తుందనే ఆశతో ఉన్నానని తెలిపారు. అయితే గత ప్రభుత్వాలు నిర్వాసితులను మోసం చేశాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు హామీ ఇచ్చినట్లుగా ఉద్యోగాలు కల్పించాలని కోరారు."ఈరోజు నేను ఈ స్థితిలో ఉన్నానంటే నిర్వాసితుల ఉద్యోగాల కోసం నా జీవితాన్ని అంకితం చేసి శ్రమించడమే కారణం. ఎన్నోసార్లు ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసినా ఫలితం దక్కలేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జటపోలు సభలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకుని నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి



చేశారు.ఈ సందర్భంగా డాగోజీరావు మాట్లాడుతూ దామోదర్ రెడ్డి మహబూబ్‌నగర్ గడిగారం చౌరస్తాలో 188 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి శ్రీశైలం నిర్వాసితుల కోసం అపారమైన సేవ చేశారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిని ఈరోజు ఈ స్థితిలో చూడటం చాలా బాధగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిగిలిన నిర్వాసితులందరికీ ఉద్యోగాలు కల్పించాలని, మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇంకా చాలామంది నిర్వాసితులు దయనీయ స్థితిలో ఉండి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి వడ్డెమాను విష్ణువర్మ ఎస్ శ్రీనివాసులు గూడెం శాంతయ్య బాల స్వామి ఎండి జహంగీర్ యాపర్ల దామోదర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం.

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చి 09 (ప్రజా జ్యోతి)**

నారాయణ పేట జిల్లా కేంద్రంలోనీ భగత్ సింగ్ భవన్ లో జరిగిన పి వై ఎల్ సమావేశానికి హాజరైన ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగ , ఉపాధి అవకాశాల కల్పనలో పూర్తిగా ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని, జాబ్ క్యాలెండర్ అమలుకు నోచుకోలేదు. నిరుద్యోగ భృతి ఊసే లేదు. యువత భవిష్యత్ పై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదనేది స్పష్టంగా కనబడుతున్నది. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల చుట్టూ తిరుగుతూ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని ఉన్న నిరుద్యోగ యువతి యువకులకు నోటిఫికేషన్లు లేక ఉద్యోగాలు రాక ఉపాధి లేక అనేక రకాలుగా మనస్థాపానికి గురై ఇబ్బందులు పడుతున్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడది లోపే ఒక లక్ష 90 వేల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కనీసం వాళ్లపై కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ ప్రభుత్వాలకు ఎన్నికలపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగ సమస్యను పరిష్కరించి ఉద్యోగాలు కల్పించి చేయూతనిద్దామనే ధ్యాసనే లేదు. కేంద్రంలో బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం గతంలో అనేక హామీలు ఇచ్చిన ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న నరేంద్ర మోడీ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు కూడా కల్పించకుండా నిరుద్యోగులని మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నాడు. కులం, మతం పేరుతో విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులని పక్కదారి పట్టించి వాళ్ళ సమస్యలు పరిష్కరించే ప్రయత్నం ఏమాత్రం చేయడం లేదు. ఉపాధి లేక లక్షలాదిమంది నిరుద్యోగులు ఫీజీలు, పీహెచ్డీలు




పూర్తి చేసి ఉద్యోగాలు లేక ఏమి చేయాలో అర్థం కాక వాళ్ళ డిగ్రీల పట్టాలను చేతబట్టి రోడ్లపై తిరుగుతున్నారు. నిరుద్యోగులను గోసపెడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తక్షణమే స్పందించి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల యువకులు, నిరుద్యోగులు ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనాలు చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధు, జిల్లా సహాయ కార్యదర్శి మధు జిల్లా నాయకులు రవి, కృష్ణ, శివ , గణేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి అవమానం ఆగ్రహం వ్యక్తం చేసిన దళిత సంఘ నాయకులు ప్రజలు

**అలంపూర్ ,మనోవపాడ్ (ప్రజా జ్యోతి) మార్చి 09:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి అవమానం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పెద్దపోతులపాడు గ్రామంలో సోమవారం ఉదయం గ్రామస్తులు చూడగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి అవమానం జరిగింది.గ్రామములో ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి వేళల్లో తల,చేతి వేలుపై పశువుల పేడను అంటించి అవమాన పర్చారు అని తెలిపారు.అంబేద్కర్ కి అవమానం జరిగిన విషయం తెలుసుకొని దళిత సంఘాలు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.అంబేద్కర్ ను అవమాన పరిచిన నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు అంబేద్కర్ విగ్రహానికి అవమానం జరిగిందంటే యావత్ భారత జాతికి అవమానం జరిగినట్టు అని మండిపడ్డారు. తక్షణమే పోలీస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినట్టు దళిత నాయకులు తెలిపారు.

ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా మండల పోలీసు యంత్రాంగం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## ఎం.ఎల్.డి.ప్రిన్సిపాల్ కి ప్రొఫెసర్ గా పదోన్నతి

-ప్రిన్సిపల్ ను అభినందించిన పాల్లెపాడు గ్రామ సర్పంచ్ రమేష్





**గద్వాల (ప్రజాజ్యోతి) మార్చి 09:**

గద్వాల లో స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కలందర్ బాషా షేక్.ప్రొఫెసర్ గా పదోన్నతి కల్పిస్తూ కాలేజీయేట్ కమీషన్ ఉత్తర్వులు జారీ చేసింది.ఉన్నత విద్యా బోధనలో 15సంవత్సరాలనుండి వివిధ స్తాయిలో హిందీ బోధన,పరిశోధనలు చేస్తూ జాతీయ సెమినార్ లలో పత్రాలు సమర్పించారు.పుస్తకాలు ముద్రించారు మధిర,మహబూబాబాద్,పెద్దపల్లి,గోదావరి ఖని డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్ గా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారు ప్రస్తుతం గద్వాల ఎం.ఎల్.డి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ గా తన బాధ్యతలను నెరవేరుస్తున్నారు. ప్రొఫెసర్ గా పదోన్నతి లభించిన సందర్భంగా పల్లెపాడు గ్రామ సర్పంచ్ రమేష్ కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

## జిల్లా ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాల సిబ్బందిచే రోగులకు పండ్ల పంపిణీ



**నాగర్ కర్నూల్ :మార్చ్ 09ప్రజా జ్యోతి**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక సిబ్బంది సోమవారం సాధారణ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.డిప్యూటీ సూపరిడెంట్ డా.వి.శేఖర్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రవికుమార్ నాయక్ పండ్ల పంపిణీని ప్రారంభించారు.నర్సింగ్ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు సేవాతత్వరత కలిగి ఉండడం మంచిన్నారు.ఆస్పత్రిలోనీ పలు వార్డులలోని చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను అందజేశారు.కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు,ఆసుపత్రి నర్సింగ్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## సదరన్ శిబిరం విజయవంతం

### -సూపరింటెండెంట్ డాక్టర్ శేఖర్

నాగర్ కర్నూల్ : మార్చ్ 09ప్రజా జ్యోతి

సాధారణ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సదరం శిబిరం విజయవంతం అయినట్లు జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.శేఖర్ తెలిపారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రత్యేకంగా గుర్తించిన తీవ్రమైన నరాల బలహీనత,తీవ్రమైన కండరాల బలహీనత ఉన్నవారికి నిర్వజించినశి ఈ బిరాన్ని డిప్యూటీ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వివిధ అంగవైకల్యాలతో ధ్రువీకరణ పత్రాలు పొందిన వారి శరీరంలో జరిగిన అధిక మార్పులు గుర్తించిన 56 మందికి నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే.రవికుమార్ నాయక్,వైద్య బృందం హాజరైన 44 మందిని ప్రత్యేకంగా పరీక్షలు జరిపారు.అదేవిధంగా నేటి సదరం శిబిరంలో కంటిచూపు దృష్టిలోపం గల వారికి పది మందికి ప్రత్యేకంగా శిబిరంలో పరీక్షలు నిర్వహించి 100% అంగవైకల్యం ఉన్న వారికి



రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో అధిక మొత్తంగా పెన్షన్ మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.దృష్టిలోపం ఉన్నవారిని కంటి విభాగం వైద్యులు డాక్టర్. ప్రియాంక బృందం ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో సదరంఅధికారులు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు,క్యాంప్ అడ్మిన్ఏ.నరసింహారెడ్డి,కో-ఆర్డినేటర్,పి.ప్రభాకర్,డాటా ఎంట్రీ ఆపరేటర్లు హైమావతి,చంద్రశేఖర్,నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల,నర్సింగ్ అధికారులు ఆనంద్,సిబ్బంది యాదగిరి,జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రోగులు తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రజాస్వామ్య విలువలపై దృష్టి సారించాలి






### - స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ

### ఘనంగా వికసి భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం

**నాగర్ కర్నూల్ మార్చ్ 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

యువత నాయకత్వ లక్షణాలు తోపాటు ప్రజాస్వామ్య విలువపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం డిగ్రీ కాలేజీలో ప్రకసిద్భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై, ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయం పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రాజకీయాల్లో రాణిస్తారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా నోడల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మదన్మోహన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నందుకు వారికి అభినందించారు. అదేవిధంగా కాలేజ్ ప్రిన్సిపాల్ రవిపరంగి మాట్లాడుతూ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కళాశాలలో ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యార్థి దశ నుంచే యువతలో నాయకత్వ లక్షణాలు నైపుణ్యాలు కలిగి ఉండాలని రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. అంతకుముందు విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో యూత్ ఆఫీసర్ కోటా నాయక్ జూరీ సభ్యుడుగా జగదీశ్వర్ రెడ్డి, సర్పంచ్ కాట్రాజ్ పద్మ వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ కోఆర్డినేటర్ ధూప్ సింగ్ ఆధ్యాపకులు ఆద్యపాకేతర సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## రాష్ట్రంలో మళ్లీ సారా దుకాణాలు తెరవాలి

### - జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

### -"లిక్కర్ కన్నా సారానే మంచిది"

### -అసెంబ్లీలో ప్రస్తావిస్తా: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మార్చి 09, ప్రజా జ్యోతి**

రాష్ట్రంలో సారా దుకాణాలను మళ్లీ ప్రారంభించాలని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లేవనెత్తిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాకు తెలియజేస్తూ ..... గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సారా తాగిన వారు ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించేవారని, కానీ ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న లిక్కర్ కారణంగా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించారు. "ఒకప్పుడు సారా తాగిన వారు 110 నుంచి 115 సంవత్సరాల వరకు జీవించేవారు. కానీ ఇప్పుడు లిక్కర్ తాగుతున్న వారు 70--80 సంవత్సరాలకే చనిపోతున్నారు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో ఉన్న వారిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సారా దుకాణాలు ఎందుకు మూసివేసారో తనకు అర్థం కావడం లేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరతానని ఎమ్మెల్యే వెల్లడించారు. గ్రామీణ సమాజంలో ఒకప్పుడు సారా ఒక సాధారణ పానీయంగా ఉండేదని, కానీ తరువాతి కాలంలో విధాన పరమైన మార్పులు, మద్యం నియంత్రణ చర్యల కారణంగా సారా తయారీ మరియు విక్రయాలపై నిషేధం విధించబడిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న మద్యం రకాలలో కల్తీ, అధిక రసాయనాల వినియోగం వంటి అంశాలు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో సారా తయారీకి నియంత్రిత అనుమతులు ఇవ్వడం, ప్రభుత్వం పర్యవేక్షణలో విక్రయాలు జరగడం వంటి అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతేకాకుండా, సారా వినియోగంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ఒక సందర్భంలో రష్యాకు చెందిన మహిళా



శాస్త్రవేత్త చేసిన పరిశోధనలో సారా తాగడం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు దూరంగా ఉండే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ వ్యాఖ్యలు సామాజిక వర్గాల్లో విభిన్న అభిప్రాయాలకు దారితీశాయి. కొందరు ఆయన వ్యాఖ్యలను విమర్శిస్తూ ఆరోగ్యపరమైన అంశాలను సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందని చెబుతుండగా, మరికొందరు గ్రామీణ సంప్రదాయాల పరిరక్షణ కోణంలో ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. మొత్తానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనే కాకుండా ప్రజల్లో కూడా పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. రాష్ట్రంలో మద్యం విధానం, ప్రజారోగ్యం, సంప్రదాయ పానీయాల ప్రాముఖ్యత వంటి అంశాలపై మళ్లీ చర్చలు మొదలయ్యేలా ఈ వ్యాఖ్యలు మారాయి. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం చర్చ ఏ దిశగా సాగుతుందో వేచి చూడాల్సి ఉంది.

## ఘనంగా ప్రిజం విద్యాసంస్థ దశాబ్ది వార్షికోత్సవం

### -95 టీంల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు





**నాగర్ కర్నూల్ : మార్చ్ 09ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రిజం విద్యా సంస్థను స్థాపించి పది సంవత్సరాలు పూర్తి ఐనసందర్భంగా దశాబ్ది వేడుకలు సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్ల నిరంజన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉపాధి దిశగా వెల్లుతూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.ఈ వేడుకలలో విద్యార్థుల యొక్క ప్రతిభ పాటవాలు,ఆట,పాట,నాట్యరీతిలను కనబరుస్తూ 95 టీంలతో వచ్చిన విద్యార్థులను,పోషకులను ఆనంద ఉత్సవాలలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థులు వారి శాస్త్ర సాంకేతిక జ్ఞాన నివేదికలను అద్భుతంగా ప్రదర్శించారు.ఈ వేడుకలలో స్కూల్ యాజమాన్యం కృష్ణయ్య,వైస్ ప్రిన్సిపాల్ దాసర్ల దేవేందర్,స్వప్న విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దేవేందర్,పవన్,రామకృష్ణ,సలీమ్,భలిందర్,భరత్,వసంత,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**చిన్నంబావి, మార్చి 9 (ప్రజాజ్యోతి)**



చిన్నంబావి మండల కేంద్రంలోని సోమవారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్న ఏ నాగరాజు వాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించి లైసెన్స్ ఆర్ సి. అందుబాటులో ఉంచుకోవాలని బండి కాగితాలు తనిఖీ చేసినప్పుడు చూపించాలని అన్నారు మద్యం తాగి ఆనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదు మద్యం సేమిస్తే కఠిన చర్యలు తప్పవని వాహనదారులకు ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు

## బాల్య వివాహలకు వ్యతిరేకంగా జమ మసీదులో అవగాహన కార్యక్రమం

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చు 09 (ప్రజా జ్యోతి)

విజన్ సంస్థ ఆధ్వర్యం లో కోటకొండ స్థానిక జామా మసీదు లో బాల్య వివాహల పట్ల అవగాహన కార్యక్రమాన్ని సంస్థ సోషల్ మొబైలైజర్ రమేశ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. వారు బాల్య వివాహాలకు వ్యతిరేకం గా పనిచేస్తామని బాల్య వివాహాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తామని కార్యక్రమంలో జామ మసీద్ సదర్ పేరు మైనుద్దీన్, సెక్రటరీ ఇస్మాయిల్, వార్డు మెంబర్ రఫీ, యువకులు పాల్గొని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేశారు.



# సోదరభావంతో పండుగలు జరుపుకుందాం..

## – ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 9 (ప్రజాజ్యోతి):** రంజాన్ మాసం ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైనదని, సమాజంలో సకల జనులు సుఖసంతోషాలతో సౌభాగ్యంగా ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో ఉపవాస దీక్షలో ఉన్న వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైనదని, సమాజంలో సకల జనులు సుఖసంతోషాలతో సౌభాగ్యంగా ఉండాలని కోరుకున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు కఠినమైన ఉపవాస దీక్షలు చేస్తారని ఆయన కొనియాడారు. ఈ ఏడాది ఉగాది, రంజాన్ పండుగలు ఒకేసారి రావడం శుభసూచకమని, పండుగలు ప్రజల్లో ఐకమత్యం మరియు సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. హిందూ--ముస్లిం సోదరులు రెండు పండుగలను శాంతియుతంగా, ఐకమత్యంతో నిర్వహించుకుని మత సామరస్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బి.ఆర్.ఎస్ నాయకురాలు డాక్టర్ ప్రత్యూష పాల్గొని ముస్లిం సోదరులను పేరు పేరున ఆప్యాయంగా పలకరించి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్, గులాం ఖాదర్ ఖాన్, హారీఫ్, సమద్, సయ్యద్ జమీల్, సయ్యద్ జహంగీర్, ఇమ్రాన్, యూసుఫ్, ఏ.కె. పాషా, ముద్దుసార్, నయ్యుం, అస్లాం, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్, గంధం బాలపీర్, గంధం పరంజ్యోతి, వెంకట్ సాగర్, చిట్యాల రాము, కొల్లాపూర్ రాము తదితరులు హాజరయ్యారు.



# ప్రజావాణి ఫిర్యాదులకు వేగంగా పరిష్కారించాలి

## – జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
## –ప్రజావాణిలో 119 దరఖాస్తుల స్వీకరణ

**మహబూబ్‌నగర్, మార్చి 9 ( ప్రజా జ్యోతి బ్యూరో )** ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు ఎంతో నమ్మకంతో తమ సమస్యల పరిష్కారం కోసం వస్తారని, అందిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి తగిన న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 119 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును అధికారులు జాగ్రత్తగా చదివి అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని అవసరమైన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక శాఖ నుంచి మరొక శాఖకు అర్థం లేకుండా దరఖాస్తులను పంపడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్‌డీవీ, ప్రణాళిక శాఖ, గనుల శాఖ, భూ సేకరణ విభాగాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులపై అధికారుల నుంచి కలెక్టర్ వివరణ కోరారు. వచ్చే వారంలోపు పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందినవి, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు.అనంతరం 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిల్లో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి రోజు నిర్వహించిన కార్యక్రమాల ఫోటోలు, వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారని, పంచాయతీ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) పర్యవేక్షణ చేస్తారని తెలిపారు.



ఈ సందర్భంగా జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు జగపతి రావు, ఎం. బాలయ్య, అశోక్ కుమార్, నాగభూషణం, కోటి రెడ్డి తదితరులు నూతన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మరియు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియలను మర్యాదపూర్వకంగా కలిసి పూలగుచ్చాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, జెడ్‌పీసీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 14 ఫిర్యాదులు



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 09 (ప్రజా జ్యోతి)** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంధర్ రెడ్డి,అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను వివిధ శాఖల అధికారులు ఆర్ .డి.ఓ.రామచందర్ పాల్గొన్నారు.

## నేడు కుమ్మెర సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**-ఏ.ఈ మాన్య నాయక్**

**నాగర్ కర్నూల్ : మార్చ్ 09ప్రజా జ్యోతి** నాగర్ కర్నూల్ మండల పరిధిలోని కుమ్మెర సబ్ స్టేషన్ లో నేడు (సోమవారం) ఉదయం 09:00 గంటల నుండి మ : 12:00 వరకు సబ్ స్టేషన్‌మైంటనెన్స్ ఉన్నందున సబ్ స్టేషన్ పరిధిలోని కుమ్మర,కార్నొండ,లింగసానిపల్లి,వసంతపూర్,పర్వతాయిపల్లి,తుమ్మలసూర్,ఎతృతాపూర్,గ్రామాల విద్యుత్ వినియోగదారులకు పవర్ సప్లై లో అంతరాయం ఉంటుంది ప్రజలు గమనించి సహకరించాలని ఏ.ఈ మాన్య నాయక్ తెలిపారు.

## కులమతాల ఐకమత్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు...

**కల్వకుర్తి మార్చి09( ప్రజా జ్యోతి):** పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు కులమతాల ఐకమత్యానికి ప్రతీక అని మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి అన్నారు.సోమవారం కల్వకుర్తి పట్టణంలోని అబూబకర్ మస్జిద్ ముస్లిం సోదరులకు కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,తన తనయుడు తలసాని రాజవర్ధన్ రెడ్డితో కలిసి ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షను విరమింపజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మక్బూల్,మైనారిటీ నాయకులు ఇంతియాజ్ ఖాన్,యాహియాఖాన్,నాసర్ ఖాన్,జహీర్,ఇంతియాజ్, అంజద్,మస్జిద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మెగా రైతు మేళాలో మహబూబ్‌నగర్ మహిళా రైతుల సందర్శన

- ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన
- ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటన

మహబూబ్‌నగర్, మార్చి 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ) రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ లో మార్చి 8, 9 తేదీల్లో నిర్వహించిన మెగా రైతు మేళాలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా మహిళా రైతులు సోమవారం క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ మెగా రైతు మేళాను విశ్వవిద్యాలయం ప్రధాన కార్యక్రమంగా నిర్వహించింది. రైతు సంక్షేమం, మహిళా సాధికారత అనే ప్రధాన అంశాలతో ఈ మేళా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర పరిశ్రమలు మరియు ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో 55 శాతం కంటే ఎక్కువగా ఉన్న మహిళా రైతులను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ మేళాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మహిళా రైతులు క్షేత్రస్థాయి పరిశీలన (ఎక్స్‌పోజర్ విజిట్) కోసం మేళాను సందర్శించారు. మేళాలో వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతలపై ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డ్రోన్ల ద్వారా పంటలకు మందుల పిచికారీ, రోబోటిక్స్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ), ఐటీ పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు.

రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించే ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. దాదాపు 70--80 ప్రదర్శన స్టాళ్లలో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రదర్శించారు. అదేవిధంగా రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలపై శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ముఖాముఖి చర్చించే అవకాశాన్ని కల్పించారు. సంప్రదాయంగా సాగు చేస్తున్న వరి, పత్తి పంటలతో పాటు ప్రత్యామ్నాయ లాభదాయక పంటల సాగుపై కూడా రైతులకు మార్గదర్శకత్వం చేశారు.



# పరిశుభ్ర పట్టణమే ప్రగతికి మార్గం

## – జడ్చర్ల మున్సిపాలిటీలో అవగాహన ర్యాలీ, ఈ--వేస్ట్ సేకరణ, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

మహబూబ్‌నగర్, మార్చి 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ) "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాలుగో రోజు కార్యక్రమాలను అధికారులు విభిన్న రీతుల్లో నిర్వహించారు. "పరిశుభ్ర పట్టణం -- ప్రగతికి బాట" అనే థీమ్‌తో ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఉదయం మున్సిపల్ కార్యాలయం నుండి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణ పరిశుభ్రతను కాపాడుకోవడం, తడి--పొడి చెత్తను వేరు చేయడం, ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ--వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించారు. ఇళ్ల నుండి, వ్యాపార సంస్థల నుండి పాడైపోయిన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అలాగే బోయలకుంట పార్కులో కంపోస్ట్ తయారీ కార్యక్రమం నిర్వహించారు. పార్కులో రాలిన ఆకు



వ్యర్థాలను సేకరించి వాటిని ప్రకృతి సిద్ధమైన ఎరువుగా మార్చే ప్రక్రియను చేపట్టారు. అనంతరం వార్డు నంబర్--24లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీలను శుభ్రపరచడం, రోడ్లను పరిశుభ్రం చేయడం, చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను తొలగించడం వంటి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు చైతన్య చౌహన్, కుమ్మరి రాజు, ప్రశాంత్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# షాపింగ్ కాంప్లెక్స్ షాపుల కేటాయింపులో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి...

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ...

## అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేత...

**కల్వకుర్తి మార్చి09(ప్రజా జ్యోతి ):**

షాపింగ్ కాంప్లెక్స్ షాపుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ అమరేందర్ ను కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కాంప్లెక్స్ షాపుల కేటాయింపుకు సంబంధించి అదనపు కలెక్టర్ అమరేందర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కాంప్లెక్స్ షాపులను స్థానికులకి కేటాయించాలని పేర్కొన్నారు. ఎస్సీ కాంప్లెక్స్ షాపుల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను పరిగణలోకి తీసుకొని ఎస్సీ నిరుద్యోగ



యువతను గుర్తించి జనాభా తమాషా పద్ధతిలో ఎంపిక చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేరటి మల్లేష్, శ్రీను,నరేష్,రాజు,తదితరులు ఉన్నారు.

# దళితుల హక్కుల కోసం పోరాడిన మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా ఘటనాలు

## -దళితులను అణచివేయాలని చూస్తున్న రెడ్డి వర్గానికి చెందిన నాయకుడు

## -రామచంద్ర రెడ్డి పై కఠినమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి వినతి

అలంపూర్,ఐజా మండలం (ప్రజా జ్యోతి) మార్చి 09:

దళితులను అణచివేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామంలోని అగ్రకుల నాయకుడిపై దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై గ్రామస్తులు బాధితులు దళిత సంఘ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు. దళితులపై జరుగుతున్న అన్యాయాన్ని ఆపాలని స్థానికులు డిమాండ్ చేశారు. దళితుల హక్కుల కోసం పోరాడిన మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా,అయిజ మండలం, ఉత్తనూరు గ్రామానికి చెందిన ఇటుకల పని చేసుకొని బ్రతుకుతున్న దళితులను ఉపాధి లేకుండా చేస్తున్నా ఉత్తనూరు బిఆర్ఎస్ పార్టీ గ్రామ ఉప సర్పంచ్ రామచంద్ర రెడ్డి మీద చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలతో భీమ్ ఆర్మీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జి మాచర్ల ప్రకాష్, భీమ్ ఆర్మీ గద్వాల జిల్లా ప్రజా సంఘాలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈఆర్ఎస్ పార్టీ నాయకుడు రామచంద్ర రెడ్డి దళితులను ఉద్దేశపూర్వకంగా దళితుల ఉపాధి లేకుండా చేయాలనీ ఇటుకల చేతి వృత్తుల పని చేసుకొని జీవనం సాగిస్తున్న దళితులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతూ అనుచరులతో చంపుతామని బెదిరిస్తూ అనేక రకాలుగా దళితులను రెడ్డి కులానికి చెందిన రామచంద్ర రెడ్డి అణిచివేస్తున్నారని లక్షల మంది ఉన్న దళితులు ఇట్టి సంఘటనను కండించాలని అధికారులు ఎస్సీ,ఎస్టీ చట్టం క్రింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రజా సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు,కెవిపిఎస్ నాయకులు,సిపిఐ నాయకులు,భీమ్ ఆర్మీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి ఉండాలి

## -ఎస్.ఐ రమాదేవి




**నాగర్ కర్నూల్ : మార్చ్ 09ప్రజా జ్యోతి**

మహిళలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగిఉండాలని ఎస్.ఐ.రమా దేవి అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా సోమవారం మహిళలు ఎదుర్కొంటున్న సైబర్ సమస్యలపైఅవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులోసైబర్ స్టాకింగ్,ఇంపర్సునేషన్,హనీ ట్రాప్,సీసాం, కేసులపట్ల అవగాహన కల్పించారు. ఈ సదస్సులోసైబర్ క్రైమ్ శాఖ ఇన్స్పెక్టర్ రమాదేవి,కానిస్టేబుల్ రవికుమార్,షీ-టీం నుండి ఎస్.ఐ రజత,కళాశాల ప్రిన్సిపల్ గీతాంజలిపాల్గొన్నారు.

# కృష్ణా సరిహద్దులో అక్రమ గోవా మద్యం పట్టివేత

## – ఎక్సైజ్ దాడులతో అక్రమ రవాణాదారులకు గుబులు




**కృష్ణ (ప్రజా జ్యోతి) మార్చు/9/2026**

కృష్ణ మండల పరిధిలోని సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ అధికారుల అప్రమత్తతతో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టుబడింది. సోమవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ ఎస్సై శిరీష, చెక్‌పోస్ట్ ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా 3.465 లీటర్ల గోవా మద్యం బయటపడింది.

సరిహద్దు ప్రాంతాల ద్వారా అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా పట్టుబడిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయడంతో అక్రమ రవాణాదారులు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. "ఎక్కడైనా అక్రమ మద్యం రవాణా జరిగితే కఠినంగా వ్యవహరిస్తాం. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే తప్పించుకునే అవకాశం లేదు" అని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల జిల్లాలో అక్రమ మద్యం రవాణా పెరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. రాత్రింబవళ్లు తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు హెచ్చరించడంతో అక్రమ వ్యాపారులలో గుబులు నెలకొంది.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడినలుగురిపై కేసు నమోదు

మల్దకల్ మార్చి 09(ప్రజా జ్యోతి):మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూరు గ్రామంలో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి నలుగురిని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఆనంద్ గౌడ్,సవారి, కటిక గోపాలు,శశిధర్ రెడ్డి లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొండా శ్రీహరి తెలిపారు. వెంకటేశు వెంకటేష్‌కు చెందిన షెడ్డులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.4,610 నగదు,మూడు బైకులు,ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.